క్లుప్తంగా

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

రాపూరు: రాపూరులో ఆదివారం త్రైత సిద్ధాంత భవద్గీత జ్ఞాన గ్రంథాలపై ప్రచారం నిర్వహించినట్లు త్రైత సిద్ధాంతం, ప్రబోధన సేవా సమితి అధ్యక్షుడు పెంచల నరసయ్య తెలిపారు. కమిటీసభ్యులు పెంచలయ్య, కిషోర్, మధు, గాయత్రి, అభినయ, కిరణ్, వెంకటరత్నం, పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చేయూత



వ్యాధిగ్రస్తులకు సరుకులు ఇస్తున్న సర్పంచ్

చిల్లకూరు: తమ్మినపట్నం పంచాయతీ పరిధిలో దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతున్న వారికి గ్రామంలోని కోదండరామ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ యరటపల్లి పృథ్వీరెడ్డి, మాజీ చైర్మన్ యరటపల్లి చరణ్‌రెడ్డిల దాతృత్వంతో ఆదివారం సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఫలసరుకులు, పౌష్టికాహారం అందించారు.

కండలేరులో 53.602 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 53.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరు జలాశయానికి 1,450 క్యూసెక్కులు, హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 2వేలు, పిన్నేరువాగుకు10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు30, హైలెవల్ స్లూయిజ్‌కు 50, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



కమ్మవారిపాళెంలో స్కిట్‌లు వేస్తున్న యువతులు

చిల్లకూరు: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికే క్రమంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చర్చిలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కమ్మవారిపాళెం లోగోస్ లూథరన్ చర్చిలో యువకులు, చిన్నారులు క్రీస్తు ప్రభువు పుట్టుక, ఆయన సువార్తను ఎలా చాటారు అనే విషయాలపై స్కిట్‌లను వేయగా అందరిని అలరించాయి.

వైష్ణవాలయాల ముస్తాబు



విద్యుద్దీపాల వెలుగులో లక్ష్మీనరసింహస్వామి ఆలయం

చిల్లకూరు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పలు వైష్ణవాలయాలు అందంగా ముస్తాబు అవుతున్నాయి. రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో ఆలయాలు కనువిందుచేస్తున్నాయి. మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనంలో దర్శించుకోవచ్చని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందలి ఆనంద్ ఆదివారం తెలిపారు. అలాగే చింతవరంలోని చెన్నకేశవస్వామి దేవస్థానం, వరగలిలోని కోదండరామస్వామి ఆలయం, చెన్నకేశవ స్వామి ఆలయం, తమ్మినపట్నంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలోనూ స్వామి వారు ఉత్తర ద్వారా దర్శనంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓలు తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో న్యూ జోష్

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వాకాడు: గత టీడీపీ ప్రభుత్వంలో అష్టకష్టాలతో కనిపించిన రాష్ట్ర ప్రజలు గడిచిన మూడున్నరేళ్ల జగనన్న ప్రభుత్వంలో అమలైన నవరత్నాల పథకాలతో న్యూజోష్ కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంటు బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం వాకాడులోని తన నివాసంలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు భారీగా తరలి వచ్చి వేడుకల్లో పాల్గొని రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి భారీ కేక్‌ను కట్ చేసి నేతలకు, కార్యకర్తలకు తినిపించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండి, పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. జిల్లాతోపాటు రాష్ట్రంలో 175 స్థానాల గెలుపునకు తనవంతు కృషిచేస్తానని రామ్‌కుమార్‌రెడ్డి నూతన జోష్ కనబరిచారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రజాభివృద్ధిలో విప్లవాత్మకమైన మార్పులతో పరుగులు తీస్తుందన్నారు. ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు ఆర్థిక అసమానతలను తొలగించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టపడి పనిచేస్తున్నారన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గూడూరు: పట్టణంలోని రాణీపేట అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని అర్బన్ సీడీపీఓ మెహబూబ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై, 21 సంవత్సరాలు నిండి, 35 ఏళ్లలోపు వివాహిత అయి ఉండాలన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 7వ తేదీలోపు అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలని ఆమె కోరారు.

గూడూరురూరల్: గూడూరు, చిల్లకూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రూరల్ సీడీపీఓ ఎస్.కె.షంషాద్‌బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.గూడూరు మండలంలోని తిప్పవరప్పాడు (బీసీ), చెన్నూరు (హరిజనవాడ-2), ఈదలపల్లి, కాంద్ర(హరిజనవాడ), చిల్లకూరు మండలంలో పాలిచెర్లవారిపాళెం, ఎన్.ఆర్.పల్లి, ఉడతావారి పార్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈనెల 2వ తేది నుంచి 7వ తేది వరకు గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్ వద్ద ఉన్న ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులను తీసుకుంటారన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెంకటగిరి: వెంకటగిరి ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని డక్కిలి మండలం తిమ్మాయిపాళెం, మాటుమడుగు-1లో అంగన్‌వాడీ కార్యకర్త, వెంకటగిరి రూరల్ మండలంలోని 9వ బెటాలియన్, బాలాయపల్లి మండలంలో పాకపూడిలో అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డక్కిలి: వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని డక్కిలి మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాయిపాళెం (ఓసీ), మాటుమడుగు-1 (ఓసీ)కేటాయించారన్నారు. ఈ పోస్టులకు ఈనెల 7వ తేదీ లోపు వెంకటగిరి ప్రాజెక్టులో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



పెంచలకోనలో శ్రీవారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు

రాపూరు: పెంచలకోన నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. పెంచలకోనలో వెలసివున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లోని మూలమూర్తులకు తెల్లవారుజామున 4గంటలకు అభిషేకం, తిరుప్పావై, ప్రత్యేక పుష్పాలంకరణసేవ అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. 10.30 గంటలకు స్వామివారి అలంకారమండపంలో ఉత్సవ విగ్రహాలు ఉంచి వివిధ పుష్పాల ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాల నడుమ దేవదేవేరుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం..



పెంచలకోనలో వైద్యశిబిరం

పెంచలకోనలో వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యులు సూర్యధర్మేంద్ర తెలిపారు.

కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం



స్వర్ణాభరణ దివ్య శోభిత అలంకారంలో చెంగాళమ్మ

సూళ్లూరుపేట: నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నూతనశోభను సంతరించుకుంది. రంగు రంగుల విద్యుద్దీపాలతో, ఆలయం లోపల రంగు రంగుల రంగవల్లులతో ఆలయాన్ని అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దారు. నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారు స్వర్ణాభరణ దివ్య శోభిత అలంకారంతో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి శనివారం అర్ధరాత్రి 12.30 గంటలనుంచే భక్తులు బారులు తీరారు. పాలకమండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామునుంచే దర్శనాలు ప్రారంభం కావడంతో సాయంత్రం దాకా కూడా భక్తుల రద్దీ తగ్గలేదు. క్యూలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాన్ని చేయించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కోలాటం భజనలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

కిటకిటలాడిన ఆలయాలు

సైదాపురం: సైదాపురం మండలంలో ఆదివారం ఘనంగా నూతన సంవత్సరం వేడుకలను జరుపుకున్నారు. సైదాపురం సమీపంలోని సిద్ధలయ్య కోనలో వెలసి ఉన్న శ్రీనవనాధులు, శ్రీనవకోటి, శ్రీసారంగధరుడు స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వాముల వారికి అభిషేకం చేశారు. అధిక మంది భక్తులు పాల్గొన్ని స్వాముల వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సైదాపురంలోని సాయిబాబా, బాలత్రిపురసుందరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో ఉన్న వైకుంఠపురంలో వెలసి ఉన్న మహావిష్ణువు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా తాతాయ్య స్వామి భక్తులకు పలు సందేశాలను అందించారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్లను భక్తులకు అందజేశారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

చిల్లకూరు: అన్నమయ్య జిల్లాలోని చిన్నమండెంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు అండర్-19 విభాగంలో సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో కళాశాలకు చెందిన గోపిశేష, అభిలాష్, వెంకటేశ్వర్లు, జవహర్‌బాబు, చైతన్య, యశ్వంత్ పాల్గొన్నారు. వీరిలో అత్యుతమ ప్రతిభ కనబరిచిన అభిలాష్ అనే విద్యార్థి జాతీయస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నారు. ప్రిన్సిపల్, మీరా సాహెబ్ ఆధ్వర్యంలో రాష్ట, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆదివారం కళాశాల ఆవరణలో అభినందించారు.

సత్తా చాటిన గూడూరు విద్యార్థినులు



సింధు



నిహారిక

గూడూరు: రాష్ట్రస్థాయిలో జరిగిన యోగా పోటీల్లో గూడూరు విద్యార్థినులు తమ సత్తా చాటారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో గత నెల 22వ తేదీ నుంచి 24వ తేదీవరకూ రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. గూడూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఎన్ నిహారిక, 9వ తరగతి చదువుతున్న జి. సింధూ అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వారు ప్రశంసా పత్రంతోపాటు, మెడల్స్‌ను సాధించారు.

జిల్లా స్థాయికి..

గూడూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నియోజకవర్గ స్థాయిలో జరిగిన కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 23వ తేదీ గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన నియోజవర్గస్థాయి పోటీల్లో దాసరి స్రవంతి, వి.అనన్య కబడ్డీలోనూ, వెంకటరమణమ్మ త్రోబాల్‌లోనూ పాల్గొని, విజేతలై జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్ మాధవిలక్ష్మి, పీడీ సీహెచ్ విజయలక్ష్మి అభినందించారు.

తడలో నూతన సంబరాలు



దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

తడ: నూతన సంవత్సర వేడుకలను తడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పారిశ్రామిక వాడలకు కేంద్ర బిందువుగా ఉన్న తడలో పరిశ్రమల కార్మికులు, వివిధ రకాల ఉద్యోగులు పెద్ద ఎత్తున తడకు చేరుకోవడంతో వ్యాపారాలు జోరుగా సాగాయి. తడకండ్రిగ చెల్లాతమ్మ ఆలయం, బోడిలింగాలపాడు సాయిబాబా మందిరం ఆలయాల్లో ముందే చేరుకుని దర్శనాలు చేసుకున్నారు.

బడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయం



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నేత గంధవళ్లి సిద్ధయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండా నమూనాలు ఉన్న భారీ కేక్‌ను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు రాజారెడ్డి, కిషోర్ యాదవ్, జయరామయ్య, మల్లికార్జున రెడ్డి, చెంచయ్య, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు రవి, నాగార్జున, చంద్రారెడ్డి, షేక్ షబ్బీర్, విజయ్, అశోక్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ..

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆదివారం కొత్తగా మంజూరైన వారికి పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీపీ ధనలక్ష్మి పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సాయంత్రం వరకు కూడ 90 శాతానికి పైగా పింఛన్ల నగదు పంపిణీ చేసినట్లు కమిషనర్ శ్రీనివాసరావు వెల్లడించారు.

నూతన సంబరాల్లో ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొత్త సంవత్సర వేడుకలను ఆదివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను సత్కరించి కేక్‌లు కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అభిమానులు 1016 అపిల్స్‌తో తయారు చేసిన మాలను వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న డీఎస్పీ

గూడూరు: విద్యతోపాటు, క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాల్సి ఉందని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ షటిల్ చాంపియన్ షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి డీఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత, సెల్ ఫోన్‌లతో ఎక్కువ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. అలాకాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే ఉన్నత చదువుల్లోనూ, ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్‌లు పొందే అవకాశాలున్నాయన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, జమాలుల్లా, ఎస్‌ఐ పవన్‌కుమార్, హర్ష, దీపు, ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరి: పట్టణంలోని పెద్దమసీదు (జామియా మసీదు) హిదాయతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఇస్లాం కమిటీ ప్రెసిడెంట్ పి గౌస్‌బాషా, సెక్రటరీ అబూబాకర్, కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వెంకటగిరి గవర్నమెంట్ ఖాజీ సైఫుద్దీన్ ఖాద్రి పాల్గొన్నారు.

సందర్శకులతో పక్షుల కేంద్రం కిటకిట



పొదిగిన పిల్లలతో గూడబాతులు



నత్తగుల్ల కొంగల పిల్లలు

దొరవారిసత్రం: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం వేల మంది సందర్శకులతో కిక్కిరిసింది. దూరం ప్రాంతాల నుంచి ఇక్కడకు విచ్చేసిన పర్యాటకులు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సరాన్ని ఓవైపు ఘనంగా జరుపుకుంటుంటే మరో వైపు విడిది చేసే విహంగాలు పొదిగిన పిల్లల కేరింతలు అంబరాన్ని అంటాయి. ప్రస్తుతం గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కుకొంగలు, నీటికాకులు, స్వాతికొంగలు, నారాయణపక్షులు అన్ని చెరువుల్లో ఉన్న కడప చెట్లపై పిల్లలను పొదిగి ఉన్నాయి. పెద్ద పక్షుల వేటాడి తీసుకొచ్చిన ఆహారాన్ని పిల్ల పక్షులకు పెట్టే దృశ్యాలు, వాటి చేష్టలు పక్షిప్రేమికులను ఇట్టే కట్టిపడేశాయి. గడిచిన మూడేళ్లలో కరోనా కారణంగా పక్షుల కేంద్రంకి సందర్శకుల సంఖ్య బాగా తగ్గిపోయిన విషయం తెలిసిందే. ఈదఫా అధిక మొత్తంలో ఆదివారం మూడువేల మందికి పైబడి సందర్శకులు కేంద్రంకి విచ్చేసినట్లు స్థానిక వన్యప్రాణి విభాగం సిబ్బంది తెలిపారు. చెన్నై, తిరుపతి, నెల్లూరు, బెంగుళ్లూరు, విజయవాడ, గుంటూరు, ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కేంద్రాన్ని ఉదయాన్నే విచ్చేసి రోజంతా ఇక్కడే ఎంతో ఆనందంగా గడిపి తిరిగివెళ్లారు. పక్షుల కేంద్రానికి విచ్చేసే పర్యాటకుల కోసం స్థానిక ఎఫ్‌ఆర్‌ఓ వరప్రసాద్ మార్గమధ్యలో, పర్యావరణ కేంద్రం వద్ద తాగు నీటి వసతి కల్పించారు. చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్ల వద్ద విహంగాలను తిలకించేందుకు బైనాక్యూలర్స్ ఏర్పాటు చేశారు. విహంగాల ప్రాధాన్యత గురించి సందర్శకులకు సిబ్బంది వివరించే విధంగా చర్యలు చేపట్టారు.



వ్యూ పాయింట్ల వద్ద సందర్శకుల సందడి

పింఛన్ల పండుగ



పెంచలయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

రాపూరు: రాపూరుకు చెందిన కోదూరు పెంచలయ్య(75) అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు చిన్నబజారు సమీపంలో కుమార్తె ఇంట్లో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ సాయి సందీప్ ఆదివారం నెల్లూరుకు చేరుకుని పింఛన్ అందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ రూ.2,750 అందించడం పట్ల ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

చిల్లకూరు: మండలంలో 90 శాతం పింఛన్లు ఒకే రోజు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.



నెల్లూరులోని ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధికి చికిత్స తీసుకుంటున్న తిప్పగుంటపాళెంకు చెందిన శ్రీనివాసులరెడ్డికి ఆదివారం వలంటీర్ నక్కా కిన్నెర, సచివాలయ కన్వీనర్ పవన్‌రెడ్డి నెల్లూరుకు వెళ్లి రూ.10 వేలు పింఛన్ అందించారు.

సైదాపురం: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఇంటి తలుపు తట్టి వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లతో అధికారులు కూడా హాజరై పింఛన్లు పంపిణీ చేశారు.



తోకలపూడిలో పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు చిత్తలూరు పోలయ్య



చాగణంలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ పెంచలయ్య

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామ సచివాలయం పరిధిలోని సూరపుఅగ్రహారం గ్రామానికి చెందిన సమ్మన శివయ్య. ఇతనికి రెండు కిడ్నీలు దెబ్బతినడంతో కొన్ని నెలల నుంచి డయాలసిస్ చేసుకుంటూ అతికష్టం మీద కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నెల కిందట సీకేడీయూ పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. వెంటనే స్పందించిన సంబంధిత సిబ్బంది విచారణ జరిపి ఉన్నతాధికారులకు దరఖాస్తు పంపారు. వెంటనే డయాలసిస్ కోసం సీకేడీయూ పింఛన్ మంజూరు కావడం ఆదివారం సచివాయం సిబ్బంది రూ.10వేల నగదును ఇంటికి వెళ్లి అందివ్వడంతో శివయ్య కళ్లలో ఆనందం కనిపించింది. జగనన్న చేసిన మేలు ఎప్పటికి మరువలేనని పింఛన్ దారుడు సంతోషం వ్యక్తం చేశాడు.



నగదును శివయ్యకు అందిస్తున్న సిబ్బంది

ద్విచక్రవాహనాలు ఢీ

వెంకటగిరి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పట్టణంలోని పాతబస్టాండ్-పాలకేంద్రం సెంటర్ మార్గంలోని కుమ్మరిగుంట సాయిబాబా పుష్కరిణి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. దాచెరువు గ్రామానికి చెందిన శ్రీను, కోటి పాలకేంద్రం వైపుగా ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అదేసమయంలో అటువైపు వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొనడంతో శ్రీను, కోటి, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.